ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 9 మే 2025

ఉష్ణోగ్రత
గరిష్ఠం 39.5
కనిష్ఠం 20.4


ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

» జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

మాడ్గుల, మే 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. గురువారం మండలంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, మందులు విక్రయించాలని ఆదేశించారు. లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం, మనగ్రోమర్, సెంటర్‌ను, సింగల్‌విండో కార్యాలయాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పారెడ్డిపల్లిలోని మహేందర్ ఫర్టిలైజర్స్ ఇర్విన్‌లోని శ్రీనివాస ట్రేడర్స్ షాపులను తనఖీ చేసినట్లు తెలిపారు. వివిధ షాపుల్లోని ఎరువుల నిల్వలను తనఖీ చేసి నకిలీ ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడు

» ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవి రచయిత దుబ్బాకుల కృష్ణస్వామి రచించిన స్మృతిపథంలో పద్య గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి సాహితీవేత్తలు దోరవేటి, డాక్టర్ భాస్కరయోగి, ప్రముఖ కవి చిత్రకారుడు గుండోజు యాదగిరి తదితరులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభగల కవులు, రచయితలు ఉన్నప్పటికీ వారి ప్రతిభ బయటి ప్రపంచానికి రావడం లేదన్నారు. వారిని ప్రోత్సహించి వారి రచనలను పది మందికి చేరవేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీజేపీ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ పాండరిగౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

» ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ రాజు, సీఐ జగదీశ్

ఇబ్రహీంపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): వాహనాలు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. నాగార్జునసాగర్ ప్రధాన రహదారి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహెడ క్రాస్ రోడ్డు వద్ద గురువారం సీఐ జగదీశ్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంతో వాహనాలు నడుపొద్దని సూచించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరని పేర్కొన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపొద్దన్నారు. ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

11,723 గ్రూపులకు రూ.959.18 కోట్లు అందజేత

రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా టాప్

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపిక

పురస్కారం అందుకున్న డీఆర్‌డీఏ అధికారులు

మహిళా సంఘాల అభ్యున్నతికి మరింత కృషి


మహిళా సంఘాల సభ్యుల సమావేశం

లక్ష్యానికి మించి..

ఎస్‌హెచ్‌జీలకు బ్యాంక్ లింకేజీ రుణాలు

స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించడంలో జిల్లా దూసుకెళ్తోంది. లక్ష్యానికి మించి రుణాలు అందించి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డును సొంతం చేసుకుంది. 112.29 శాతం రుణాలు అందించి శభాష్ అనిపించుకుంది. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15,571 సంఘాలకు రూ.850.42కోట్ల రుణాల లక్ష్యం ఉండగా 11,723 గ్రూప్‌లకు రూ.959.18కోట్లు అందించింది. బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ లక్ష్యాలను అధిగమించడంతో డీఆర్‌డీఏను ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును గురువారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ చేతుల మీదుగా డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, అదనపు పీడీ సూర్యారావు, డీపీఎం బాల్‌రాజ్, ఏపీఎం సత్యనారాయణ, యాదగిరి, జిల్లా సమాఖ్య కార్యదర్శి కవిత, సీసీ వినోద్ అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న డీఆర్‌డీఏ అధికారులు

రంగారెడ్డి అర్బన్, మే8 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు బ్యాంకు లికేజీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది. రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. వారిలో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించి ఆర్థికాభివృద్ధి సాధించడానికి మరింత భరోసా కల్పిస్తున్నారు. రుణాలు పొందిన సభ్యులు

మిగతా 8వ పేజీలో...

అవార్డు దక్కడం సంతోషం



జిల్లాకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. మహిళల సాధికారత లక్ష్యంలో రుణాల పంపిణీ కీలకమైన అంశం. అందుకు తగ్గట్టుగా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక ప్రణాళికతో పంపిణీకి దిశానిర్దేశం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా సెర్ప్ సిబ్బంది, మండల సమాఖ్యలు సమన్వయంతో కృషి చేస్తున్నాయి. ఇందులో రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవడానికి కృషి చేసిన డీఆర్‌డీవో సిబ్బందికి ధన్యవాదాలు.

- శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ



యాచారం ప్రత్యేకాధికారిగా మాధవరావు

యాచారం, మే 8(ఆంధ్రజ్యోతి): యాచారం మండల ప్రత్యేకాధికారిగా జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారి మాధవరావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు పనిచేసిన సంధ్యారాణి మరో శాఖకు బదిలీ కావడంతో మాధవరావు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రగతికి పాటుపడుతానని పేర్కొన్నారు.

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

» ఈనెల 17 వరకు మీ సేవ కేంద్రాల్లో స్వీకరణ
» ఇంటర్ గణితంలో 60శాతం మార్కులు తప్పనిసరి
» కలెక్టర్ నారాయణరెడ్డి



రంగారెడ్డి అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భూమికి సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూ భారతి(భూ హక్కుల రికార్డు)చట్టం-2025ను ఏప్రిల్ 14న తీసుకువచ్చింది. రెవెన్యూ పరిపాలనకు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగం సహాయంగా రాష్ట్రంలోని దాదాపు ఐదు వేల మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. దీనికోసం లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హతగల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులను ఆహ్వానిస్తుందన్నారు. ఈనెల 17వ తేదీ వరకు జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్ల దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. మీ సేవ కేంద్రంలో రూ.100 చెల్లించి దరఖాస్తు ప్రాస్పెక్టస్ పొందాలన్నారు. దరఖాస్తు చేసుకునే లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఇంటర్‌లో గణితంలో 60 శాతం మార్కులు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్(సివిల్) డిప్లొమా, బీటెక్(సివిల్) లేదా సమానమైన అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి జూలై 26వ తేదీ వరకు 50 పని దినాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై సంబురాలు



భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా అమలు చేయడాన్ని హర్షిసూ కడ్తాల మండల కేంద్రంలో గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో సైన్యానికి సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. జై హింద్.. జై ఆపరేషన్ సిందూర్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు లాయక్‌అలీ, కొప్పు కృష్ణ, కుమార్, నాగరాజు, వెంకటేశ్, మహేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్, మే8(ఆంధ్రజ్యోతి)



రావిర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మే 8(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాల, గుర్రంపల్లి గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బీజేపీ ప్రభుత్వం దేశంలో మతవిద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజాస్వామ్యాన్ని బలహీన పరిచేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. రావిర్యాల గ్రామానికి అదనపు బస్సు సౌకర్యంతోపాటు బీటీరోడ్డుకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ విశాల, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు పిట్ట రజిత, నాయకులు వెంకటనర్సింహారెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, కృష్ణ, బాల్‌రాజ్, శివ, శ్రీను, బాలయ్య, అర్షద్ పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్, చుక్కమెట్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేష్‌కుమార్, జగదీశ్వర్, షాద్‌నగర్ ఆర్డీవో సరిత, రెవెన్యూ సిబ్బంది మహేందర్‌గౌడ్, శివకుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


విమాన సర్వీస్‌ను ప్రారంభిస్తున్న జీఎంఆర్ అధికారులు

శంషాబాద్ టు వియత్నాం

విమాన సర్వీస్‌ను ప్రారంభించిన జీఎంఆర్

శంషాబాద్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వియత్నాం రాజధాని హనోయ్‌కు బుధవారం నూతన విమాన సర్వీస్‌ను ప్రారంభించినట్లు జీఎంఆర్ అధికారులు తెలిపారు. వియత్నాం ఎయిర్‌లైన్స్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వారానికి (ఆది, బుధ, శుక్ర) మూడు రోజులు ఈ విమానాలు రాకపోకలు సాగిస్తాయని జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వియత్నాంకు విమాన ప్రయాణికుల రద్దీ పెరగడంతోనే ఈ విమాన సర్వీసులు ప్రారంభించామని చెప్పారు. వీటితో పాటు మరికొన్ని ప్రాంతాలకు విమాన సర్వీసులను విస్తరిస్తామని తెలిపారు. దేశీయ విమాన సర్వీసులతో పాటు అంతర్జాతీయ విమాన సర్వీసుల కనెక్టివిటీని ప్రయాణికులకు అనుగుణంగా పెంచుతామని వివరించారు.

ప్రతిపాదనలకే పరిమితం!


వంతెనకు నోచుకోని మంగళపల్లి - చెన్నారం రోడ్డు

మంగళపల్లి - చెన్నారం బీటీ రోడ్డు నిర్మాణం ఎప్పుడో!

వాగుపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందులు

దశాబ్దాలుగా ప్రతిపాదనల్లోనే నిలిచిన బీటీ నిర్మాణం

అమలుకు నోచుకోని నేతల హామీలు

ఆమనగల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): రెండు మండలాలను కలిపే మంగళపల్లి - చెన్నారం రోడ్డు బీటీ ఏర్పాటు, వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలాయి. నేతల హామీలు ప్రతిపాదనల్లోనే నిలిచాయి. ఈ రోడ్డును బీటీగా మార్చి వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. రోడ్డు సరిగా లేక రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాలుగా బీటీ రోడ్డు, వంతెన నిర్మాణం హామీలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. మంగళపల్లి నుంచి చెన్నారం వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డును బీటీగా మారిస్తే ఆమనగల్లు, షాద్‌నగర్ వెళ్లడానికి ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. మండల పరిషత్ నుంచి కూడా పలుమార్లు ఈ రోడ్డు,

మిగతా 8వ పేజీలో...


వంతెన నిర్మాణానికి కృషి



మంగళపల్లి- చెన్నారం రోడ్డును బీటీగా మార్చి వాగుపై వంతెన నిర్మించాలని ప్రభుత్వానికి నివేదించాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి వంతెన నిర్మాణం గురించి విన్నవించగా సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయించి బీటీ రోడ్డు, వాగుపై వంతెన నిర్మాణం చేపడుతాం. మంగళపల్లి నుంచి వేణుగోపాల స్వామి ఆలయం మీదుగా షాద్‌నగర్ రోడ్డును కలిపే మట్టి రోడ్డును కూడా బీటీగా మార్చడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

- కొప్పు జంగయ్య, మాజీ సర్పంచ్ - మంగళపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



మంగళపల్లి- చెన్నారం రోడ్డు బీటీ విషయంలో ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వాగుపై వంతెన నిర్మించాలి. వంతెన లేని కారణంగా వర్షాకాలంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు, వంతెన నిర్మాణాలకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలి.

- ఎర్రవోలు శ్రీను - మంగళపల్లి

దారి తప్పించిన గూగుల్ మ్యాప్!

పెన్నా సిమెంటు కర్మాగారానికి వెళ్లాల్సిన ట్యాంకర్ గ్రామ శివారుకు..

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి బీభత్సం


విద్యుత్ స్తంభాలకు తగిలి నిలిచిన సిమెంట్ ట్యాంకర్

తాండూరు రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్ పెట్టుకొని డ్రైవ్ చేసిన పెన్నా సిమెంటు కర్మాగారం ట్యాంకర్ దారి తప్పింది. కర్మాగారానికి వెళ్లాల్సిన ట్యాంకర్ మరో గ్రామం వైపు వెళ్లింది. ఈ సంఘటన గురువారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముంబయి నుంచి సిమెంటు ట్యాంకర్(ఎంహెచ్46బీయు9705) నుంచి తాండూరు మండలం బెల్కటూర్ పరిధి పెన్నా సిమెంట్ కర్మాగారానికి బయల్దేరింది. ట్యాంకర్ డ్రైవర్ గూగుల్ మ్యాప్ పెట్టుకొని ప్రయాణయ్యాడు. గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ట్యాంకర్ బెల్కటూర్‌కు బదులుగా గూగుల్ మ్యాప్ వీరారెడ్డిపల్లి వైపు చూపడంతో డ్రైవర్ అదే మార్గంలో వెళ్లాడు. దీంతో ట్యాంకర్ శివారులోని విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది.

తెగిపడ్డ విద్యుత్ వైర్లు

పొలాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇది గమనించిన గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. వీరారెడ్డిపల్లి, బెల్కటూర్ గ్రామాల శివార్లు కలిసి ఉండటంతో రెండు గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డు మీదుగా వెళ్తే ట్యాంకర్ కర్మాగారానికి చేరుకునేది. కానీ గూగుల్ లొకేషన్‌తో వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు తెగిపడ్డ పొలంలో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పిందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి కొంత మేర గడ్డి దగ్ధమైంది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ వైర్లు, స్తంభాలకయ్యే ఖర్చు భరిస్తామని లారీ యజమాని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. డ్రైవర్ గూగుల్ మ్యాప్ పెట్టుకుని నిర్లక్ష్యంగా రావడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

మున్సిపాలిటీల్లో 100 డేస్ ప్రోగ్రాం

జూన్ 2 నుంచి ప్రారంభం

ప్రణాళికలు రూపొందించాలని సీడీఎంఏ ఆదేశం

పారిశుధ్యం, పచ్చదనం ప్రజారోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో 100 డేస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. జూన్ 2 నుంచి సెప్టెంబరు 12 వరకు వంద రోజులు చేపట్టి పట్టణ స్థాయిలో పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సీడీఎంఏ మంగళవారం కమిషనర్లను ఆదేశించారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, కొడంగల్, వికారాబాద్, పరిగి మున్సిపాలిటీల్లో సమస్యల పరిష్కారమే ఎజెండాగా '100 డేస్ ' ప్రోగ్రాం చేపడుతున్నారు. పారిశుధ్యం, పచ్చదనం, ప్రజారోగ్యం అంశాలపై ఈ ప్రోగ్రామ్‌లో దృష్టి పెడతారు. మున్సిపాలిటీ వార్డుల్లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో కార్యక్రమంలో డ్రెయిన్లలో పూడిక తీత, ఖాళీ స్థలాల్లో బుష్ కట్టింగ్, పచ్చదనంలో భాగంగా నర్సరీలు పెంపు, పార్కుల అభివృద్ధి, ఎవెన్యూ ప్లాంటేషన్, మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందేలా చూడడం వంటి పనులు చేపడతారు.

విభాగాల వారీగా కార్యక్రమాలు

మెప్మా ఆధ్వర్యంలో కొత్తగా మహిళా గ్రూప్‌లను ఏర్పాటు చేయడం, స్ట్రీట్ వెండర్లకు సర్టిఫికెట్ల అందజేత, రుణాలివ్వడం వంటి వాటిపై ప్రణాళికలు తయారు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు వైద్య శిబిరాలను నిర్వహించాలి. ప్రజలకు క్యాన్సర్, కంటి వంటి శిబిరాలను నిర్వహించాలి. టౌన్ ప్లానింగ్ వారు గుర్తించిన పార్కుల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయాలి. వెంచర్లలో పది శాతం స్థల అభివృద్ధికి అవసరమైన ఫైల్ తయారు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని సీడీఎంఏ సూచించింది.

8 మంది డీఎస్పీల బదిలీ



హైదరాబాద్, మే8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 8మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖాజీపేట ఏసీపీగా పి.ప్రశాంత్‌రెడ్డి, మేడ్చల్ ఏసీపీగా సీహెచ్ శంకర్‌రెడ్డిని బదిలీ చేసి ఇక్కడున్న బి.శ్రీనివాసరెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. శంషాబాద్ ఏసీపీగా వి.శ్రీకాంత్‌గౌడ్, నర్సంపేట ఏసీపీగా పి.రవీందర్‌రెడ్డిని బదిలీ చేసి ఇక్కడున్న కిరణ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. కాచిగూడ ఏసీపీగా వై.హరీష్‌కుమార్, వైరా ఏసీపీగా సారంగపాణిని నియమించి ఇక్కడున్న ఎంఏ రహీంను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.


మణివీర్, మధులిక తేజలను సన్మానిస్తున్న న్యాయవాదులు

యువ న్యాయవాదులకు సన్మానం

షాద్‌నగర్ అర్బన్ మే, 8(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ జడ్జీలుగా ఎంపికైన షాద్‌నగర్‌కు చెందిన యువ న్యాయవాదులు సి.మణివీర్, డాకన్నగారి మధులిక తేజలను న్యాయవాదులు ఘనంగా సన్మానించి, అభినందించారు. షాద్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణు గోపాల్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం బార్ అసోసియేషన్ భవనంలో వారిని సన్మానించారు. సంకల్పం, పట్టుదల ఉంటే ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సి.మణివీర్, డాకన్నగారి మధులిక తేజలు నిరూపించి షాద్‌నగర్ గౌరవాన్ని పెంచారని ఈ సందర్భంగా న్యాయవాదులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చీపిరి చంద్రశేఖర్, కోశాధికారి లింగంగౌడ్, సహాయ కార్యదర్శి నర్సింహులు, న్యాయవాదులు ఎంఏ కరీం, కంచి రాజ్‌గోపాల్, చెంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, పాతపల్లి కృష్ణారెడ్డి, కట్టి గంగాధర్, శివరాములుగౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్త, ప్రభాకర్‌గౌడ్, కె.మనోహర్‌రెడ్డి, కె.శంకరయ్య, బి.రమేష్, కె.జయమ్మ, శ్రీశైలం, విజయ్‌కుమార్, ఇంజమూరి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పక్కన నిలిపిన బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- **విరిగిన కమాన్ పట్టీలు.. ప్రయాణికుల భయాందోళన**
- **డ్రైవర్ అప్రమత్తత.. అందరూ క్షేమం**

చేవెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి కోస్గి వెళ్లే బస్సు కమాన్ పట్టీలు విరిగిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కన నిలిపాడు. దాంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల మండల పరిధిలోని మీర్జగూడ గేట్ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబుబ్‌నగర్ జిల్లా కోస్గి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని చేవెళ్ల పట్టణం మీదుగా కోస్గికి బయలుదేరింది. బస్సు నడుస్తుండగానే ప్రమాదవశాత్తు కమాన్ పట్టీలు విరిగిపోవడంతో డ్రైవర్ బాల్యానాయక్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి ఆపాడు. ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కాగా, బస్సుల్లో దాదాపు 50 మందికిపైగా ప్రయాణికులున్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం ప్రయాణికులను బయటకు దింపి మరో బస్సులో పంపించారు. పోలీసులు ఘటన పరిస్థితిపై డ్రైవర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యర్థుల నవ్వులు


నవ్వులు చిందిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి

తాండూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వారు ముగ్గురూ ప్రత్యర్థులు. రాజకీయంగా పోటీపడుతూ ఒకరంటే ఒకరికి పడని వారు. అయితే వారు ఒకే వేదికపై కలిశారు. అంతేకాదు.. ఒకరినొకరు పలకరించుకుంటూ నవ్వులు చిందించారు. ఈ దృశ్యం జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్‌లో గురువారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. అందులో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ), తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (కాంగ్రెస్), ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి (కాంగ్రెస్) ఒకే వేదికపై కూర్చున్నారు. వీరి మధ్య మాటలు కలిసి ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకోవడం అక్కడున్నవారిని ఆకర్షించింది. ఎప్పుడూ ఒకరిపై ఒకరు రాజకీయ పరంగా తిట్టుకునే వారు ఇలా నవ్వులు పూయించడం చూసిన పలువురు 'అమ్మో! రాజకీయ నాయకులంతా ఒక్కటే' అంటూ చర్చించుకున్నారు. ఒకే పార్టీకి చెందినప్పటికీ మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిలు తాండూరు పర్యటనలో ఇటీవల కాలంలో కలిసి పాల్గొన్న దాఖలాలు లేవు. వీరిద్దరూ తాండూరు నియోజకవర్గంలో వేర్వేరుగా పర్యటిస్తూ కనిపిస్తుండటం గమనార్హం.


రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రెవెన్యూ సదస్సుల్లో 36 దరఖాస్తుల స్వీకరణ

ధారూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డమీది గంగారం, నర్సాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 36 దరఖాస్తులు అందాయి. ఈ సదస్సుల్లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వికాబాద్ ఆర్డీవో వాసుచంద్రలు పాల్గొని భూసమస్యల దరఖాస్తులను పరిశీలించారు. భూసమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా గతంలో పరిష్కారానికి నోచుకోని పలు భూసమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా గడ్డమీది గంగారంలో 24, నర్సాపూర్‌లో 12దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, డీటీ విజయేందర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


ప్రభుత్వ చీఫ్‌విప్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

తాండూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ నగరంలో గురువారంఆయన నివాసంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ప్రతినిధుల బృందం సమస్యలను వినతిపత్రం అందజేశారు. ఈనెల 10వ తేదీన నిర్వహించే రాష్ట్ర స్థాయి పంచాయతీ కార్యదర్శుల సదస్సుకు రావాలని చీఫ్‌విప్‌ను ఆహ్వానించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాల కాలం పూర్తిచేసుకొని క్రమబద్ధీకరించిన వారికి ప్రభావిత తేదీని ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని వారు కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామ పంచాయతీలకు ఉపాధిహామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని వారు కోరారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి సీతక్కలతో చర్చిస్తానని, సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజ్, గౌరవ అధ్యక్షుడు సందీప్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు సుధాకర్ పాల్గొన్నారు.


బ్రహ్మపుత్ర విత్తనాల కంపెనీలో విత్తనాలను, రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు

నాణ్యత లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు

శామీర్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): విత్తనాల కంపెనీల్లో అనుమతి లేని, నాణ్యత లేని విత్తనాలను అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ హెచ్చరించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో గల పలు విత్తనాల కంపెనీల్లో గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విత్తన ధృవీకరణ ఏడీ శివకుమార్ మండల వ్యవసాయధికారి రమేశ్, ఎస్‌వోటీ ఎస్‌ఐ రోహిత్‌లు ఆకస్మిక తనిఖీలు చేశారు. దేవరయాంజాల్ పరిధిలోని డెన్మార్క్ సీడ్స్, యూని వెజ్‌సీడ్స్, మహికో విత్తన కంపెనీ, బ్రహ్మపుత్ర సీడ్స్, సిరి సీడ్స్, కోరమండల్ సీడ్స్ కంపెనీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆ విత్తన కంపెనీల్లోని స్టాక్ విత్తనాలను, రికార్డులను, స్టాక్ బోర్డులను ఆ అధికారులు తనిఖీ చేసి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. నిబంధనలను ఉల్లంఘించి విత్తనాలను సరఫరా చేస్తే విత్తన చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్నాపూర్‌లో వీధి నాటకం


వీధి నాటకంలో పాత్రధారులు

నవాబుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్నాపూర్ గ్రామంలో రెండు రోజులుగా వీరభద్ర విజయం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. వీధి నాటకాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. కులమతాలకతీతంగా వీధి నాటకంలో పాల్గొని జానపద యక్షగానాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలకు గ్రామీణ ప్రాంతాల్లో జీవం పోయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బెంగళూరు పోలీసులమంటూ మోసం!

పెండింగ్ చలాన్ల పేరిట కుచ్చుటోపీకి యత్నం!.. పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



వికారాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను చెల్లించాలంటూ బెంగళూరు పోలీసుల పేరుతో ఓ వాహనదారుడికి కుచ్చుటోపీ పెట్టాలని సైబర్ నేరగాళ్లు ప్రయత్నించారు. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలో ఇటీవల చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిల ప్రకారం.. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని రాచయ్య కాలనీకి చెందిన అయ్యన్‌గౌడ్‌కు ఈనెల 2వ తేదీన బెంగళూరు పోలీసుమంటూ ఫోన్ నంబర్ 78423 32912 నుంచి కాల్ వచ్చింది. కర్ణాటకలో మీరు కొనుగోలు చేసిన టాటా వాహనం (కేఏ03 ఏకే 3447-పాత నంబర్), టీజీ 10 టీ 3072 (కొత్తనంబర్)పై రూ.15 వేల పెండింగ్ చలానాలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని, వరుసగా మూడుసార్లు కాల్ చేశారు. కర్ణాటక పాసింగ్ వాహనం కొనుగోలు చేసింది వాస్తవం కావడంతో తనకు కాల్ చేసింది బెంగళూరు పోలీసులేనని అయ్యన్‌గౌడ్ నమ్మాడు. తాను ఇటీవలనే ఆ వాహనం కొనుగోలు చేశానని, ఏవైనా చలాన్లు ఉంటే వాహనం పాత యజమాని చెల్లిస్తాడంటూ వారికి చెప్పే ప్రయత్నం చేశాడు. అదంతా కుదరదని, వాహనం మీ వద్ద ఉన్నందున మీరే చెల్లించాలంటూ వత్తిడి చేయడంతో ఆన్‌లైన్‌లో చలాన్ల వివరాల కోసం ప్రయత్నించగా ఏమీ వెల్లడి కాలేవు. ఈ విషయాన్ని తనకు ఫోన్ చేసిన వారికి తెలియజేయగా, కర్ణాటక చలాన్లు తెలంగాణలో కనిపించవని, వెంటనే డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. డబ్బులు చెల్లించకపోతే వాహనాన్ని తీసుకు వెళ్తామంటూ బెదిరించారు. ఈ వ్యవహారమంతా సైబర్ నేరగాళ్ల పనే అయి ఉండవచ్చని భావించిన అయ్యన్‌గౌడ్ 5న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బెంగళూరు పోలీసులమంటూ అయ్యన్‌గౌడ్‌కు ఫోన్ చేసిన వారు సింగారపు రాచయ్య కాలనీకి చెందిన వారేనని పోలీసుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది. బెంగళూరు పోలీసుల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

నిర్లక్ష్యం నీడలో క్రీడా ప్రాంగణాలు

నిర్వహణ లేక పొదలమయంగా ఆటస్థలాలు

అక్రమంగా మట్టి తవ్వకాలు.. నిరుత్సాహంలో క్రీడాకారులు



గాలిగూడ గుట్టల్లో క్రీడా ప్రాంగణం

చౌదరిగూడ, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. వాటిల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, స్కేటింగ్ తదితర గ్రౌండ్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ ప్రాంగణాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. అదీగాక నిర్వహణ లోపంతో అక్కడున్న క్రీడాసామగ్రి తప్పుపడుతోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ, ధర్మ్యతండాలో క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే నాథుడు లేడు. ప్రాంగణాలు గుంతలమయంగా, పెద్ద బండరాళ్లతో నిండి ఉన్నాయి. క్రీడా పరికరాలు తుప్పుపట్టాయి. మండలంలో 24 పంచాయతీలకు 18 క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. జాకారం, ఎల్కగూడ, చేగిరెడ్డి ఘణాపూర్, రావిర్యాల గ్రామాల్లో స్థలం లేక ప్రాంగణాలను ఏర్పాటు చేయలేదు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి క్రీడా ప్రాంగణాల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు, యువకులు అంటున్నారు.


అభివృద్ధికి నోచుకోని ధర్మ్యతండా క్రీడా ప్రాంగణం

దీంతో ప్రాంగణాలన్నీ చెట్లు పుట్టలతో దర్శనమిస్తున్నాయన్నారు. కొందరు క్రీడా ప్రాంగణాల్లో మట్టి త్రవ్వకాలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేదు. ఇప్పటికైనా అధికారులు క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో నిండిపోయింది



గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వం క్రీడ ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే వాటి నిర్వహణ లేక పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించి గ్రౌండ్‌లను చదును చేయించి ఆటలు ఆడుకునేందుకు అనుకూలంగా మార్చాలి.

- నిశ్చల్ దీపక్, క్రీడాకారుడు, తుమ్మలపల్లి

స్నేహితుడికి స్కూటీ అందజేత

» దివ్యాంగుడి పట్ల మానవత్వం చాటుకున్న సత్యనారాయణరెడ్డి


స్కూటీని అందిస్తున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో 1980-81 బ్యాచ్ టెన్త్ క్లాస్‌మేట్ చేవెళ్ల మండల పరిధిలోని అల్లావాడకు చెందిన దివ్యాంగుడు కావలి హనుమయ్య ఆయనకు చిన్నానాటి స్నేహితుడు. అయితే, అతనికి రెండు కాళ్లు లేవు. హనుమయ్య రెండు చేతులతో నడుస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల పాటు ఎలక్ట్రిక్ సైకిల్‌ను నడిపాడు. అది కాస్త రిపేర్‌కు రావడంతో హనుమయ్య ఇంటికే పరిమితమయ్యాడు. ఇటీవల పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో హనుమయ్య పరిస్థితి చూసి స్కూటీ ఇప్పిస్తానని సత్యనారాయణరెడ్డి తెలిపాడు. గురువారం తన డబ్బుతో కొనుగోలు చేసిన స్కూటీని హనుమయ్యకు అందజేశాడు. కాగా, దాని విలువ రూ.లక్షా 30 వేలు కాగా.. నాలుగు చక్రాలు కలిగి ఉంది. స్కూటీని కొనుగోలు చేసి చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద స్నేహితులందరి సమక్షంలో ప్రత్యేక పూజలు చేయించి స్నేహితుడు హనుమయ్యకు తాళం చేవిని సత్యనారాయణరెడ్డి అందజేశారు. దాంతో హనుమయ్య హర్షం వ్యక్తం చేశాడు. తనకష్టాన్ని గుర్తించి స్నేహితుడు స్కూటీని బహూకరించడం చాలా సంతోషంగా ఉందని తెలిపాడు. అలాగే వారి తోటి స్నేహితులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్నేహితులు విజయ్‌కుమార్, కుంచం సంతోష్‌కుమార్, ఖాజాపాషా, రాములు, మల్లయ్య, యాదయ్య, ప్రభులింగం, వెంకటయ్య, ఎం.జనార్దన్, శంకరయ్య, గోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములు, చంద్రయ్య, నాయకులు యాలాల మహేశ్వర్‌రెడ్డి, ఆరుణ్‌కుమార్, అంజిరెడ్డి, జంగయ్య గౌడ్, బాపిరెడ్డి, కాసుల రాఘవేందర్‌గౌడ్ తదితరులున్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, కార్మికులు

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

కొడంగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఈ నెల 20న జరిగే సీఐటీయూ దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పకీరప్ప, మొగులప్ప, రమేశ్, మహేశ్, వెంకటలక్ష్మీ, సుగుణమ్మ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు చింతల యాదయ్య, సబిత కోరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారులకు గురువారం కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం కార్మికులతో కలిసి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనచట్టంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న చేపట్టిన సమ్మెలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, సత్తమ్మ, పద్మ, రాంచందర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

యాచారం, మే 8(ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకురాలు(సూపరింటెండెంట్) శైలజ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి పైప్‌లైన్ లీకవ్వకుండ చూడాలన్నారు. కూలీలకు ప్రతి రోజు ఉపాధి చూపడంపై కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. రాజీవ్‌యువ వికాస్ పథకం కాలపరిమితి ముగిసిందన్నారు. ప్రతి రోజు కూలీలకు ప్రతి నెల వేతనాలందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆ మె చెప్పారు. సమావేశంలో ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శైలజ


మంత్రి పొన్నంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మంత్రి పొన్నంకు వీర్లపల్లి శుభాకాంక్షలు

షాద్‌నగర్ అర్బన్, మే, 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంత్రిని సన్మానించి, అభినందనలు తెలిపారు. ఆయనతో చౌదరిగూడ మండల కాంగ్రెస్ నాయకుడు కేకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


భీంరెడ్డి రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ప్రణవి, చంద్రయ్య

భీంరెడ్డి రాంరెడ్డికి ఆత్మీయ సన్మానం

కందుకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన భీంరెడ్డి రాంరెడ్డి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖలో మెదక్ జిల్లా నర్సాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు. బుధవారం రాత్రి మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో ఆయనకు పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్లు ప్రణవి, చంద్రయ్యలతో పాటు సూపరింటెండెంట్లు అంజిరెడ్డి, విజయభాస్కర్‌లు రాంరెడ్డి-వనిత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ సమయంలో ప్రజలకు, ప్రభుత్వానికి నిస్వార్థంగా సేవలందించిన వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రాంరెడ్డి ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరి అంచలంచెలుగా ఎదిగి ఇన్‌స్పెక్టర్ స్థాయికి వచ్చారని గుర్తుచేశారు. రాంరెడ్డి తోటి ఉద్యోగులు, స్నేహితులు హాజరై సన్మానించారు. నాయకులు జంగారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, వి.రమేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, పున్న భిక్షపతి, మాధారం రమేష్‌గౌడ్, బొక్క నరేందర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, భద్రయ్యలతో పాటు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దేశ రక్షణకు పాటుపడాలి

మహేశ్వరం, మే 8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకోసం ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతీ పౌరుడు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని అవేర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మాధవన్‌జీ అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు పరిధిలోగల అవేర్ ఆసుపత్రి ప్రాంగణంలో అవేర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మశాంతికి కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అవేర్ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, వరుణ్, తరుణ్, రమాకాంత్, ఇర్షత్, జాఫర్, ప్రభాకర్, వెంకన్న, గణేష్, రీనా, కళ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వసతుల కల్పన

» సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు

శామీర్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట 3వ అంగన్‌వాడీ కేంద్రానికి నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులను మున్సిపల్ డీఈఈ సునీత గురువారం ప్రారంభించారు. తాము కోరిన మేరకు తూంకుంట మున్సిపల్ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన సదుపాయాల కల్పన దిశగా చర్యలు చేపట్టడంపై ఐసీడీఎస్ సీడీపీఓ శారద కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఏళ్ల తరబడిగా సరైన డ్రైనేజీ, రోడ్డు, నీటి సౌకర్యంలేక పిల్లలు అనేక అవస్థలకు గురవుతున్నారు. అలాగే కేంద్రం పరిసరాల్లో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యలపై బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డీఈఈ సునీత, పంచాయతీ కార్యదర్శి మౌనికలకు ఐసీడీఎస్ సీడీపీఓ శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణిలు ప్రత్యక్షంగా చూపించారు. వెంటనే స్పందించిన అధికారులు ఈ అంగన్‌వాడీ కేంద్రంలో అవసరమైన మౌలిక సౌకర్యాలను యుద్ధప్రాతిపాదికన ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అంగన్‌వాడీ అధికారులకు భరోసా ఇచ్చారు. ఆ మేరకు గురువారం పనులను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు.


విద్యార్థులతో కలిసి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

భారత సైనికులకు సంఘీభావం

మేడ్చల్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన భారత సైన్యానికి మద్దతుగా గురువారం మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఉమెన్స్ విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి కళాశాలల ఫౌండర్ చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. దేశంపై ఉగ్రవాదులు చేస్తున్న దాడులను తిప్పి కొట్టడంతో పాటు పహల్గాం ఘటనపై ప్రతీకారం తీర్చుకున్న భారత సైన్యానికి తాము మద్దతుగా విద్యార్థులు పేర్కొన్నారు.

అర్హులందరికీ 'ఇందిరమ్మ ఇళ్లు'

- చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు



చేవెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మండలంలో దాదాపుగా ఇందిరమ్మ లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయ్యిందని, తొందరలోనే లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించి నిర్మాణాలకు తగిన మార్గదర్శకాలు ఇస్తామన్నారు. పైరవీకారులకు తావులేకుండా ఇళ్ల మంజూరు పారదర్శకంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ కమిటీలు, అధికారులు ఐక్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ఫేస్ టు ఫేస్

ప్రశ్న : మండలంలో ఎంత మందికి ఇళ్లు మంజూరయ్యాయి?

జవాబు : చేవెళ్ల మండలంలోని 29 గ్రామాల్లో మొత్తం 600 ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్లులేని పేదలను ముందుగా క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్నాం.

ప్రశ్న : లబ్ధిదారుల వెరిఫికేషన్ ఎప్పుడు పూర్తి చేస్తారు?

జవాబు : దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక గ్రామ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో వెరిఫికేషన్ పూర్తయ్యింది. అర్హుల లిస్టును కలెక్టర్‌కు పంపించిన తర్వాత ఫైనల్ లిస్ట్‌ను ప్రకటిస్తాం.

ప్రశ్న : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే నిర్మించుకోవాలా?

జవాబు : ప్రభుత్వ ఉన్నతాధికారు రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇంటిని 66 గజాల్లో నిర్మించుకోవాలి. లబ్ధిదారుడికి నాలుగు విడతల్లో రూ.5లక్షలు అందిస్తాం. అదేవిధంగా ఇల్లు మంజూరై ఆర్థిక పరిస్థితి బాగాలేని లబ్ధిదారుడికి ఐకేపీ ద్వారా రుణం రూ.5 లక్షల వరకు రుణం కూడా అందిస్తారు.

ప్రశ్న : రాజీవ్ యువశక్తికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నుంచి 990 దరఖాస్తులు వచ్చాయి. అయితే, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్టీ యూనిట్స్ 6 యూనిట్లు, బీసీ 153 యూనిట్లు, ఎస్సీ 198 యూనిట్లు మంజూరయ్యాయి. తొందరలోనే లబ్ధిదారుల వెరిఫికేషన్ నిర్వహిస్తాం.

పంటల దిగుబడి పెంచుకోవాలి

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు
- రైతులకు అవగాహన కార్యక్రమాలు

కడ్తాల్/ఆమనగల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త అనిత, ప్రొఫెసర్లు డాక్టర్ సుప్రజ, విద్యాసాగర్, డాక్టర్ శిరీషదీప్తి, సాహితిలు సూచించారు. మండలంలోని రావిచెడ్, టాక్‌రాజ్ గూడలో గురువారం రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల సాగు, విత్తనాల ఎంపిక, భూసార పరీక్షలు, ఆరుతడి పంటలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు ఏఓ శ్రీలత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోపాల్, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో నిర్వహించిన ఇన్‌చార్జి ఏడీఏ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీ పీ నారాయణ, యూనివర్సిటీ విద్యార్థులు



చేవెళ్ల : గొల్లపల్లిలో మాట్లాడుతున్న ప్రమీల



షాబాద్ : మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి

శంకర్‌పల్లి : రైతులు సాంకేతిక పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ తెలిపారు. ఏర్వగూడలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు రైతులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శాస్త్రవేత్త లక్ష్మి, ఏడీఏ సురేష్‌బాబు, ఇన్‌చార్జి ఏవో సురేష్‌బాబు, రైతులు తదితరులున్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

షాబాద్ : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ కావలి చంద్రశేఖర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, డి.శ్రీనివాస్ రెడ్డి, పి.సతీష్‌లు సూచించారు. మండల పరిధిలోని చిన్నసోలిపేట్, లక్ష్మారావుగూడలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి, చెట్ల పెంపకం, కంది, పత్తి, క్యారెట్, వరి, చిక్కుడు, టమాట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు అపర్ణ, ఉమ, ఏవో వెంకటేశం, ఏఈవోలు, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

పంటమార్పిడితో ఎంతో మేలు

చేవెళ్ల : పంటమార్పిడితో చీడపీడలను తగ్గించుకోవచ్చని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ప్రమీల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.రమ్య తెలిపారు. గొల్లపల్లి, కుమ్మెర తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టగొడుగుల పెంపకం గురించి వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు కవితాకిరణ్, స్నేహలత, చేవెళ్ల ఏవో శంకర్‌లాల్, ఏఈవోలు బాలకోటేశ్వర్, ప్రతిభ, రైతులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు

ఇబ్రహీంపట్నం, మే 8(ఆంధ్రజ్యోతి): నేటి(శుక్రవారం) నుంచి జూన్ 6వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి విద్యాధరి తెలిపారు. నేను(శుక్రవారం) పోల్కంపల్లిలో, 12న ఇబ్రహీంపట్నం ఖాల్సా, రాయపోల్, 24న ముకునూరు, 26న నాగన్‌పల్లి, 28న కప్పాడు, జూన్ 4న దండుమైలారం, 6న ఎలిమినేడులో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కర్రెడ్ల నరేందర్ రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కేశంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని గురువారం కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలలో అన్ని పార్టీలకు చోటు ఉందని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. తమ పార్టీ నాయకులకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఇందిరమ్మ కమిటీలలో ఇతర పార్టీలకు చెందిన నాయకులకు చోటు లేకపోవడం విడ్డూరమని అన్నారు. కమిటీలో అందరికీ చోటు ఉంటే అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేదని తెలిపారు. చాలామంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని అన్నారు. చౌడం శ్రీనివాస్, మోటే శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, వీరేందర్ నాయక్, బైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్ల తొలిగింపు

కేశంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కొత్తపేట-కోనాయపల్లి మార్గంలో చెట్లు విరిగి రోడ్డుపై అడ్డంగా పడిపోయాయి. గురువారం గ్రామానికి చెందిన యువజన సంఘాలు, పలు పార్టీలకు చెందిన నాయకులు సొంతంగా డబ్బు పోగుచేసి చెట్లను ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. దాంతో వాహనాల రాకపోకలు ప్రశాంతంగా సాగాయి. కాగా, అధికారులు చెట్లను తొలిగించక పోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సొప్పరి నరసింహ, మాజీ ఉపసర్పంచ్ హనుమంత్ నాయక్, సొప్పరి రామకృష్ణ, కమ్మీకర్ నాగేష్, బి.కృష్ణయ్య, కె.కృష్ణయ్య, పాలాది సుధాకర్, రంగు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం!

(5వ పేజీ తరువాయి)

వాగుపై వంతెన నిర్మాణం గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయినా నేటికీ స్పందన లేదు.

వాగొస్తే.. అవతలి వైపున..

ఐదేళ్ల కిత్రం ఆమనగల్లు - షాద్‌నగర్ రోడ్డు నుంచి మంగళపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించారు. కాగా, మంగళపల్లి నుంచి చెన్నారం వరకు బీటీ రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోలేదు. మంగళపల్లి గ్రామ సమీపంలోని ఈ రోడ్డులో వాగుపై వంతెన లేని కారణంగా వర్షాకాలంలో తరుచూ వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మంగళపల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలు వాగు అవతలి వైపు ఉన్నాయి. వర్షం వస్తే రైతులు పొలాలకు వెళ్లలేని పరిస్థితి. పంచాయతీ డంపింగ్ యార్డ్, వైకుంఠధామాలు కూడా ఈ రోడ్డును అనుసరించే కట్టారు. ప్రతిసారి ఎన్నికలప్పుడు వాగుపై వంతెన, బీటీ రోడ్డు నిర్మాణం గురించి రాజకీయ నాయకులు హామీ ఇస్తున్నా ఆ తర్వాత అమలుకు నోచుకోవడం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ.50 లక్షలు మంజూరైనట్లు ప్రకటించారు. అయినా నేటికీ టెండర్లు జరుగలేదు. పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా మంగళపల్లి - చెన్నారం రోడ్డును బీటీగా మార్చి వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకోవాలని మంగళపల్లి, చెన్నారం గ్రామస్తులు కోరుతున్నారు.

లక్ష్యానికి మించి..

(5వ పేజీ తరువాయి)

వివిధ ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అడుగులు వేస్తున్నారు. కిరాణం, టైలరింగ్, బ్యూటీపార్లర్, దుస్తుల విక్రయ కేంద్రం, పిండి గిర్నీ, పాడి పశువుల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇతర సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు.

సకాలంలో రుణాలు, చెల్లింపులు

2024 - 25 ఆర్థిక సంవత్సరంలో అధికారులు రుణ లక్ష్యాన్ని అధిగమించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపారు. 15,571 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.85,042.86 లక్షలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 11,723 స్వయం సహాయక సంఘాలకు 95,918.66 లక్షలు అందించింది. నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి 112.79 శాతానికి చేరుకుంది. రుణాల చెల్లింపులో జిల్లా అధికారులు ఆదర్శంగా నిలిచారు. మహిళలు సైతం ప్రతి నెలా ఈఎంఐ రూపంలో రుణాలను తిరిగి చెల్లిస్తున్నారు.

అత్యధికంగా నాలుగు మండలాల్లో..

జిల్లాలో అత్యధికంగా శంషాబాద్, యాచారం, కందుకూరు, మొయినాబాద్ మండలాల్లోని స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలందించారు. శంషాబాద్ మండలంలో 820 ఎస్‌హెచ్‌జీలకు రూ.4,620.41 రుణం ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా 1,336 ఎస్‌హెచ్‌జీలకు రూ.7,072.87 లక్షలు రుణాలు అందించారు. రుణాల శాతం 153.08 నమోదైంది. అలాగే యాచారం మండలంలో 910 ఎస్‌హెచ్‌జీలకు రూ.5,068.30 లక్షలు రుణం అందివ్వాలని లక్ష్యం పెట్టుకోగా 825 ఎస్‌హెచ్‌జీలకు రూ.7,205.21 లక్షలు అందించారు. రుణ లక్ష్యం 142.16 శాతం నమోదైంది. కందుకూరు మండలంలోని 1,046 ఎస్‌హెచ్‌జీలకు రూ.5,427.00 లక్షలు ఇవ్వాలని లక్ష్యం కాగా 1,018 ఎస్‌హెచ్‌జీలకు రూ.7,650.90 లక్షలు అందించారు. రుణ శాతం 140.98 నమోదైంది. మొయినాబాద్ మండలంలో 1,071 ఎస్‌హెచ్‌జీలకు రూ.6,083.39 లక్షలు రుణం ఇవ్వాలని లక్ష్యం కాగా 831 ఎస్‌హెచ్‌జీలకు రూ.7,871.71 లక్షలు అందించారు. రుణ లక్ష్యం 129.40 శాతం నమోదైంది.

2024-25 ఆర్థిక సంవత్సరానికి అందించిన బ్యాంకు లింకేజీ రుణాల వివరాలు

మండలం	సంఘాలు	అందజేసిన రుణాలు(లక్షల్లో)	శాతం
శంషాబాద్	1336	7,072.87	153.08
యాచారం	825	7,205.21	142.16
మంచాల	835	6,599.85	141.29
కందుకూరు	1018	7,650.90	140.98
ఇబ్రహీంపట్నం	605	4,848.16	137.48
మొయినాబాద్	831	7,871.71	129.40
మహేశ్వరం	781	6,646.71	128.97
కొందుర్గు	282	2,792.11	127.78
నందిగామ	379	2,875.41	125.11
అబ్దుల్లాపూర్‌మెట్	831	4,496.43	117.10
చేవెళ్ల	665	5,482.56	110.55
కొత్తూరు	229	2,139.68	110.44
చౌదరిగూడెం	232	2,368.84	100.11
మాడ్గుల	362	4,082.88	99.44
ఫరూక్‌నగర్	549	5,554.64	95.39
షాబాద్	462	3,575.32	90.24
శంకర్‌పల్లి	519	3,998.84	84.85
ఆమనగల్లు	111	1,299.60	81.50
కేశంపేట్	337	3,760.71	77.78
తలకొండపల్లి	369	3,398.78	77.05
కడ్తాల్	165	2,197.45	63.49
మొత్తం	**11,723**	**95,918.66**	**112.79**

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



కందుకూరు : ఆశా వర్కర్లతో కలిసి పోస్టర్ విడుదల చేస్తున్న బాల్‌రాజ్

కందుకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో అన్నిరంగాల కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. గురువారం మండలంలోని లేమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆశావర్కర్లతో కలిసి ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మహేశ్వరం మండల కన్వీనర్ శేఖర్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

శంకర్‌పల్లి/ఆమనగల్లు, మే 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీంపాషా తెలిపారు. మోకిలలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించి యువతకు ఆయన పలు సూచనలు చేశారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం విజయవంతం కొనసాగుతోంది. ఎంఈవో పాండు పర్యవేక్షణలో శిబిరం నిర్వహిస్తున్నారు. కరాటే, యోగా, డ్యాన్స్, తదితర అంశాల్లో విద్యార్థుల అభిరుచులను బట్టి శిక్షణ ఇస్తున్నారు.



సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

క్రైం కార్నర్

దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడి అరెస్టు.. 6 తులాల బంగారు నగలు స్వాధీనం

కడ్తాల్, మే 8(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం, దోపిడీ కేసును కడ్తాల్ పోలీసులు సమయస్ఫూర్తితో 10 గంటల వ్యవధిలో ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి ఆరు తులాల బంగారు నగలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బంగారం అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేయాలని భావించిన యువకుడు కటకటాల పాలయ్యాడు. కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ గంగాధర్ నిందితుడిని, స్వాధీనం చేసుకున్న నగలను ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. కడ్తాల మండలం చరికొండకు చెందిన గొల్లకుంట మహేశ్ ఈ నెల 7న బంధువుల పెళ్లికి వెళ్తూ తన పొలం పక్కన ఉన్న అదే గ్రామానికి చెందిన నాగిల్ల మహేశ్‌కు పశువులకు నీళ్లు తాగించి మేత వేయమని తెలిపాడు. అదేవిధంగా పొలం వద్ద ఉన్న తన తల్లి జంగమ్మకు టిఫిన్ ఇవ్వమని బాక్స్ ఇచ్చాడు. కొద్దిసేపటి తర్వాత పొలం వద్దకు వెళ్లిన మహేశ్ జంగమ్మకు టిఫిన్ ఇచ్చాడు. సాయంత్రం గొల్లకుంట మహేశ్ మళ్లీ ఫోన్ చేసి తను వచ్చేందుకు ఆలస్యమవుతుందని, ఆవుల పాలు పిదికి పొలం వద్ద ఉన్న తన తల్లిని బైక్‌పై ఇంటికి తీసుకెళ్లాలని కోరాడు. అయితే, జంగమ్మ ఒంటరిగా ఉండటం, ఆమె మెడలో బంగారు నగలు చూసిన నాగిల్ల మహేశ్ ఎలాగైనా దొంగిలించి బంగారం అమ్మి జల్సాలు చేయాలని భావించాడు. మహేశ్ జంగమ్మ వద్దకు వెళ్లి ఆమె ఛాతిపై గుద్ది గొంతు పిసకడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే ఆమె మెడలో ఉన్న ఆరు తులాల బంగారు నగలను దొంగిలించి తర్వాత తిరిగి తీసుకుందామని పొలంలోనే ఓ రాయి కింద పెట్టి వెళ్లాడు. రాత్రి 10 గంటలైనా జంగమ్మ ఇంటికి రాకపోవడం, మహేశ్‌కు ఫోన్ చేసినా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో అనుమానం కలిగిన మహేశ్ వెంటనే హైదరాబాద్ నుంచి బయలుదేరి వచ్చి పొలం వద్ద గ్రామస్థులతో కలిసి వెతకగా.. పొలంలో వేసిన సోఫాలో తన తల్లి జంగమ్మ మూలుగుతూ ఉంది. ముక్కులో నుంచి రక్తం కారుతూ కనిపించింది. జరిగిన విషయాన్ని కుమారుడికి తెలపడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు జరిగిన విషయంపై ఫిర్యాదు చేశాడు. ఎస్సై వరప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా మహేశ్‌ను గుర్తించి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన కడ్తాల్ పోలీసులను ఏసీపీ రంగస్వామి అభినందించారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం




కడ్తాల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని గురువారం కడ్తాల ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులతో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు అశోక్ తెలిపారు. నాయకులు శ్రీశైలం, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి



ఆమనగల్లు : శిబిరాన్ని ప్రారంభిస్తున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు/షాద్‌నగర్ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయస్థితిలో ఉన్న తోటి ప్రాణిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని, రక్తదానం, అవయవ దానంపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ, సాయిరామ్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చిత్తరంజన్ దాస్‌తో కలిసి రాము శిబిరాన్ని ప్రారంభించారు. 86 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. హెచ్ఎం శంకర్, నాయకులు విజయ్‌కుమార్, శ్రీను, భాస్కర్, లక్ష్మీపతి, మహ్మూద్, అభినవ్‌రెడ్డి, జంగయ్య, కవిత, తదితరులు పాల్గొన్నారు. రక్తదానంపై యువకులు అవగాహన పెంచుకోవాలని షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రికి చెందిన ప్రవీణ్ పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామానికి చెందిన 25మంది యువకులు శుక్రవారం రక్తదానం చేశారు. అడివయ్య, బీమయ్య, శ్రీశైలం, కర్నెకోట రమేష్ తదితరులున్నారు.



షాద్‌నగర్ రూరల్ : రక్తదానం చేస్తున్న యువకులు

రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

ఆమనగల్లు, మే8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులు ఆర్థికంగా బలపడి అప్పులిచ్చే స్థాయికి ఎదగాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయమన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో మార్కెట్ ఛైర్‌పర్సన్ గీతనర్సింహ రైతుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత భోజన కేంద్రాన్ని నాయకులు సందర్శించి రైతులకు భోజనాన్ని వడ్డించారు. రైతుల కోసం భోజన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, పాండురంగయ్య, నాయకులున్నారు.




బీసీ సేన వనంపల్లి గ్రామ కమిటీ

బీసీ సేన మహిళా గ్రామ కమిటీలు

చౌదరిగూడ, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వనంపల్లి, గుర్రంపల్లి గ్రామాల్లో బీసీ సేన నూతన మహిళా గ్రామ కమిటీలను మండలాధ్యక్షురాలు ప్యాట జయ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా సమాజంలో గుర్తింపు లభించేంత వరకూ ఉద్యమం చేస్తామని, బీసీల గొంతు ప్రపంచానికి వినిపించేలా చేయడానికే బీసీ సేన ఏర్పడిందన్నారు. వనంపల్లి గ్రామ మహిళాధ్యక్షురాలిగా మమత, గుర్రంపల్లి అధ్యక్షురాలిగా రమాదేవిలతోపాటు మరికొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, శ్రీకాంత్, లావణ్య, అనసూజ, లక్ష్మమ్మ, యాదమ్మ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఇన్‌చార్జి ఏడీఏగా నిషాంత్ కుమార్



నిషాంత్ కుమార్‌ను సన్మానిస్తున్న ఏవోలు, ఏఈవోలు

షాద్‌నగర్‌రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ వ్యవసాయ సంయుక్త సంచాలకులుగా ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి నిషాంత్ కుమార్ గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా, ఇక్కడ ఏడీఏగా పని చేసిన రాజారత్నం పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నిషాంత్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన నిషాంత్ కుమార్‌ను తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

శంషాబాద్ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం సాతంరాయ్‌లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించారు. అంతకుముందు డీఈవో ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఏఐతో బోధనను ప్రభుత్వ బడుల్లో నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించాలని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీకాంత్



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ చేవెళ్ల మండల నూతన అధ్యక్షుడుగా ఎం.శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా నాయకులు శ్రీకాంత్ పేరును ప్రకటించారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో పలువురు బీజేపీ నాయకులు శ్రీకాంత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో మండలాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందని శ్రీకాంత్ అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, నాయకులు కృష్ణమోహన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా అభినవ్‌రెడ్డి



ఆమనగల్లు, మే8(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారెడ్డి అభినవ్‌రెడ్డి యువజన కాంగ్రెస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. గురువారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జిగా రాజేశ్



కడ్తాల్ : మండల కేంద్రానికి చెందిన క్యామ రాజేశ్ యువజన కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జిలు రాంరెడ్డి, అరవింద్‌రెడ్డిలు ఉత్తర్వులు జారీ చేశారు. రాజేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి ఇన్‌చార్జిగా శ్రీనాథ్



కేశంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జిగా కేశంపేట మండలం ఇప్పలపల్లికి చెందిన పిప్పల్ల శ్రీనాథ్‌ను నియమించారు. గురువారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ తనపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చిందని శ్రీనాథ్ తెలిపారు. పదవికి తగిన న్యాయం చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు కదం తొక్కారు. నెలల కాలంగా జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 193వ రోజుకు చేరాయి.